సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 23 । మే । 2024



వరి గడ్డికి నిప్పతో చేటు

వరిచేలలో ఎండుగడ్డి, వరిమోళ్లను తగలబెట్టడం వల్ల నష్టం ఏర్పడుతుందని హెచ్చరిస్తున్నారు. మిత్ర కీటకాలు, శిలీంద్రాలు చనిపోయి నష్టం జరుగుతుందంటున్నారు. 8లో ▸



పండ్ల సాగులో సాంకేతికత

సాగులో సాంకేతిక పద్ధతులు అవలంభించాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. నూజివీడు మామిడి పరిశోధన స్థానంలో ఉద్యాన ప్రదర్శన నిర్వహించారు. 8లో ▸



రసవత్తరంగా నాటిక పోటీలు

తాడేపల్లిగూడెంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి నాటికల పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. సందేశాత్మకంగా సాగి ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. 8లో ▸

న్యూస్‌రీల్

ఐటీఐ కోర్సులపై అవగాహన



ఎన్నార్పీ అగ్రహారం ఐటీఐలో ఒకేషనల్ గైడెన్స్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: జిల్లాలోని 2 ప్రభుత్వ, 16 ప్రైవేటు ఐటీఐల్లో నూరు శాతం అడ్మిషన్లు జరిగేలా ఐటీఐ కోర్సులపై విద్యార్థులకు ప్రత్యేక ప్రచారం, అవగాహన కల్పించాలని ఐటీఐ జిల్లా కన్వీనర్ వీ శ్రీనివాసరాజు, జిల్లా ఉపాధి అధికారి సీ మధుభూషణ్ అన్నారు. బుధవారం ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో జిల్లా ఒకేషనల్ గైడెన్స్ కమిటీ మీటింగ్‌ను నిర్వహించారు. ఐటీఐల్లో లభించే కోర్సుల వివరాలు తెలియచేస్తూ అన్ని గ్రామ సచివాలయాల వద్ద కరపత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. రెండు ప్రభుత్వ ఐటీఐల్లో 308 సీట్లు, ప్రైవేటు ఐటీఐల్లో 2,736 సీట్లు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఐపీటీడిఐసీ జేవీసీ శ్రీపతిరావు, ఏపీఎస్ఎస్‌డీసీ ఎన్.ఆంజనేయులు, డిప్యూటీ డైరెక్టర్ డీ శ్రీరామ్, డీఈఓ ఎ.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఈఏపీ సెట్

భీమవరం: భీమవరంలో ఏపీ ఈఏపీ సెట్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని డీఎన్నార్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రంలో ఉదయం షిఫ్ట్‌లో 150 మందికి 143 మంది విద్యార్థులు హాజరుకాగా మధ్యాహ్నం షిఫ్ట్‌లో 150 మంది విద్యార్థులకు 146 మంది హాజరయ్యారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని పరీక్షా కేంద్రంలో ఉదయం షిఫ్ట్‌లో 175 మందికి 170 మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లో 175 మంది విద్యార్థులకు 172 మంది హాజరయ్యారు. విష్ణు కళాశాలలో ఉదయం షిఫ్ట్‌లో 100 మందికి 98 మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లో 100 మందికి 98 **మంది** విద్యార్థులు హాజరయ్యారు.

భీమవరంలో వేసవి వాలీబాల్ ఉచిత శిక్షణ శిబిరం

భీమవరం: జిల్లా వాలీబాల్ అసో**సియేషన్** ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి **ఉచిత** వాలీబాల్ వేసవి రెసిడెన్షియల్ శిక్షణా **శిబిరం** నిర్వహించనున్నట్లు అసోసియేషన్ **జిల్లా అర్గ**నైజింగ్ కార్యదర్శి జీవీ పవన్‌కుమా**ర్‌రాజు** బుధవారం భీమవరంలో చెప్పారు. దీని**కిగాను** స్థానిక డీఎన్నార్ కళాశాలలోని గన్నా**బత్తుల** క్రీడామైదానంలో ఈనెల 25న సాయం**త్రం 4** గంటలకు సెలక్షన్స్ నిర్వహిస్తా**మన్నారు.** అర్హులైన క్రీడాకారులకు నెల రోజులపాటు వాలీబాల్ క్రీడలో అనుభజ్ఞులైన కోచ్‌లు శిక్షణ ఇస్తారని క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి సదుపాయం కల్పించనున్నట్లు చెప్పారు. డీఎన్నార్ కళాశాల యాజమాన్యం, వసుధ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే శిక్షణా శిబిరాన్ని వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ వర్మ, జి.రాఘువేంద్ర పర్యవేక్షిస్తారని, వివరాలకు 98669 22122 నంబరులో సంప్రదించాలని పవన్‌కుమార్‌రాజు కోరారు.

చూసిన కనులదే భాగ్యము



కైకలూరులో మీసాల వెంకన్న స్వామి దివ్య కల్యాణోత్సవం

కైకలూరు: మీసాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కైకలూరు శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్వామి వారి దివ్య కల్యాణం బుధవారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. చూసిన కనులదే భాగ్యం అన్న రీతిలో కల్యాణాన్ని నిర్వహించారు. స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యహవచన, నిత్యహోమం, చతుర్థశ కలశస్నపన, బలిహరణ చేశారు. మాడవీధుల్లో శేష వాహనంపై స్వామివారి ఊరేగింపు ఆకట్టుకుంది. శ్రీనివాస లక్ష్మణ ప్రవీణ్, బృందావనం లక్ష్మీనృసింహాచార్యులు, గోపికృష్ణమాచార్యులు, అగ్నిహోత్నం మిధునాచార్యులు కల్యాణ క్రతువును పూర్తి చేశారు.

జూన్ 1 నుంచి దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షలు

ఏలూరు(ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్య విధానంలో నిర్వహిస్తున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులకు సంబంధించిన సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1 నుంచి ప్రారంభంకానున్నాయని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 8 వరకూ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ కొనసాగుతాయన్నారు. విద్యార్థుల హాల్ టిక్కెట్లు ఏపీ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

శ్రీవారి కల్యాణం.. కడు రమణీయం

- నేత్రపర్వం శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం
- వైభవంగా సింహ, వెండి గరుడ వాహనాలపై తిరువీధి సేవలు
- నేడు రాత్రి 7.30 గంటల నుంచి రథోత్సవం



కల్యాణ తంతును నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: సర్వ జగద్రక్షకుడైన శ్రీవారు సర్వాభరణ భూషితుడై నుదుటున కల్యాణ తిలకం, బుగ్గన చుక్కతో సిగ్గులొలుకుతున్న ఉభయ దేవేరులను పెండ్లాడారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. వైశాఖమాస తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణ వేడుక భక్తుల గోవింద నామ స్మరణలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ కడురమణీయంగా జరిగింది. పాంచాహ్నిక దీక్షతో వైఖానస ఆగమాన్ని అనుసరించి జరిపిన ఈ కల్యాణ తంతును వీక్షించిన భక్తజనులు ఆనంద డోలికల్లో తేలియాడారు. ఈ అపురూప అద్భుత ఘట్టం ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ ఆవరణలో ఆవిష్కృతమైన వేళ.. భక్తుల మదిలో రేగిన పారవశ్యం, కన్నులలో మెరిసిన ఆనంద భాష్పాలు వర్ణనాతీతం.

కల్యాణం.. కడు రమణీయం: వారి అనివేటి మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై చిన వెంకన్న తిరుకల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా కళా సౌందర్యాలు, పచ్చిపూలతో కల్యాణ వేదికను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. అనంతరం ఆలయంలో రెండు వేరువేరు వాహనాలపై శ్రీవారు, అమ్మవార్ల కల్యాణ మూర్తులను ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. వేద మంత్రోచ్ఛరణల నడుమ, మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో శ్రీవారు, అమ్మవార్ల వాహనాలను కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. రజిత సింహాసనంపై కల్యాణ మూర్తులను ఉంచి కల్యాణ తంతును ప్రారంభించారు. శుభముహూర్త సమయంలో నూతన వధువరుల శిరస్సులపై జీలక్ర, బెల్లం ధరింపజేసి, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకను భక్తుల గోవింద నామస్మరణల నడుమ నిర్వహించారు. దేవస్థానం తరపున శ్రీవారికి ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు కుమారుడు ఎస్వీ నివృతరావు పట్టువస్త్రాలను సమర్పించగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆలయ ఈఓ వేంద్ర త్రినాధరావు దంపతులు, తిరుమల తిరుపతి దేవస్థానం వారు అమ్మవార్లకు పట్టువస్త్రాలను అందించారు. ఉదయం శ్రీవారు సింహ వాహనంపై, రాత్రి కల్యాణ మహోత్సవం అనంతరం వెండి గరుడ వాహనంపై క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. మోహినీ అలంకారంలో శ్రీవారు బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు:

- ఉదయం 7గంటల నుంచి–భజన కార్యక్రమాలు
- ఉదయం 8 గంటల నుంచి – భక్తి రంజని
- ఉదయం 10 గంటల నుంచి – కూచిపూడి భరత నాట్య ప్రదర్శనలు, భక్తి గీతాల ఆలాపనలు
- సాయంత్రం 4 గంటల నుంచి – నాదస్వర కచేరి సాయంత్రం 5 గంటల నుంచి – అన్నమాచార్య కీర్తనలు
- రాత్రి 7 గంటల నుంచి – కూచిపూడి భరతనాట్య ప్రదర్శనలు
- రాత్రి 7.30 గంటల నుంచి – శ్రీవారి దివ్య రథోత్సవం
- రాత్రి 9 గంటల నుంచి – నాటక ప్రదర్శన.
- ప్రత్యేక అలంకారం: రాజమన్నార్



ఉభయ దేవేరులతో సింహ వాహనంపై తిరువీధి సేవకు తరలివెళుతున్న శ్రీవారు



స్వామి, అమ్మవార్లను కల్యాణ వేదిక వద్దకు తీసుకెళ్తున్న అర్చకులు, ఆలయ అధికారులు, భక్తులు



స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను తీసుకెళ్తున్న ఆలయ ఈఓ త్రినాధ రావు, ఆలయ అనువంశిక ధర్మకర్త నివృతరావు



మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీవారు

తొలి ఫలితం నరసాపురం

- కౌంటింగ్‌కు అధికారులు కసరత్తు
- విష్ణు, ఎస్ఆర్‌కేఆర్ కళాశాలల్లో ఏర్పాట్లు
- 14 టేబుళ్లపై పార్లమెంట్, అసెంబ్లీ ఓట్ల లెక్కింపు
- 12 రౌండ్లలో తేలనున్న నరసాపురం ఫలితం
- ఆచంట 13, పాలకొల్లు 14, తాడేపల్లిగూడెం 15 రౌండ్లలో లెక్కింపు
- భీమవరం, ఉండి, తణుకులో 17 రౌండ్లలో తేలనున్న ఫలితం



కౌంటింగ్ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	కౌంటింగ్ రౌండ్లు
ఆచంట	187	13
పాలకొల్లు	190	14
నరసాపురం	169	12
భీమవరం	236	17
ఉండి	239	17
తణుకు	233	17
తాడేపల్లిగూడెం	209	15

సాక్షి, భీమవరం: సార్వత్రిక పోలింగ్ ముగిసింది. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుపైనే ఇప్పుడు అందరూ ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగం అదే ఒరవడితో కౌంటింగ్‌కు కసరత్తు చేస్తోంది. భీమవరంలోని శ్రీవిష్ణు, ఎస్ఆర్‌కేఆర్ కళాశాలల్లో అందుకోసం ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లాలోని నరసాపురం పార్లమెంట్, భీమవరం, తాడేపల్లిగూడెం, ఆచంట, ఉండి, తణుకు, పాలకొల్లు, నరసాపురం అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 13న ఎన్నికలు జరిగాయి. ఆయా నియోజకవర్గాల్లోని 1,463 పోలింగ్ కేంద్రాల పరిధిలో 14,72,923 మంది ఓటర్లకు గాను 12,16,667 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ అనంతరం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్, నరసాపురం, పాలకొల్లు, తణుకు, ఆచంట నియోజకవర్గాల ఈవీఎంలను శ్రీవిష్ణు కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూంలకు తరలించారు. కేంద్ర బలగాలు, రాష్ట్ర సాయుధ దళాలు, జిల్లా పోలీసులతో స్ట్రాంగ్ రూంల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ డాక్టర్ అజిత ఎప్పటికప్పుడు స్ట్రాంగ్‌రూంలను పరిశీలిస్తున్నారు.

శరవేగంగా ఏర్పాట్లు : జూన్ 4న జరిగే కౌంటింగ్ కోసం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ నేతృత్వంలో శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం నియోజకవర్గాలకు ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో, మిగిలిన నియోజకవర్గాలను శ్రీవిష్ణు కళాశాలలో ఓట్లు లెక్కింపు జరగనుంది. ఈ మేరకు ఆయా కళాశాలల వద్ద విశాలమైన గదుల్లో కౌంటింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో హాల్‌లో ఒక అసెంబ్లీ నియోజకవర్గానికి 14, పక్కనే గల మరొక హాల్‌లో పార్లమెంట్‌కు 14 టేబుళ్లు ఏర్పాటుచేస్తున్నారు. నియోజకవర్గంలోని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు పోలైన ఓట్లను రెండు చోట్ల వేర్వేరుగా లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్‌లో 13,344, హోం ఓటింగ్‌లో 1,088, సరీస్ ఓట్లు 888 కలిపి మొత్తం 15,320 ఓట్లు పోలవ్వగా వీటి లెక్కించేందుకు అదనంగా పార్లమెంట్‌కు 15 టేబుళ్లు, అసెంబ్లీకి ఒక్కో నియోజకవర్గానికి నాలుగు చొప్పున ఏడు నియోజకవర్గాలకు 28 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గానికి ఆర్ఓ, ఏఆర్ఓలతో పాటు కౌంటింగ్‌కు ఒక్కో టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్ విధులు నిర్వర్తిస్తారు. వీరితో పాటు సపోర్టింగ్ స్టాఫ్ తదితరులు కలిపి 1500 మంది వరకు సిబ్బంది కౌంటింగ్ విధుల్లో పాల్గొంటారని అంచనా.

నరసాపురం నుంచి తొలి ఫలితం

ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో లెక్కింపు మొదలుకానుంది. వెంటనే ఈవీఎంల కౌంటింగ్ మొదలవుతుంది. ఒక టేబుల్‌పై ఒక ఈవీఎం చొప్పున ఒక్కో రౌండ్‌లో 14 టేబుళ్లపై 14 ఈవీఎంలను లెక్కిస్తారు. సజావుగా సాగితే ఒక్కో రౌండ్‌లో ఓట్ల లెక్కింపు కోసం 20 నిముషాల నుంచి అరగంట వరకు సమయం పడుతుందని అంచనా. ప్రతీ రౌండ్ పూర్తయిన వెంటనే వచ్చిన ఫలితాలను ఎన్నికల అధికారి ఎన్నికల సంఘానికి చెందిన ఎన్‌కోర్‌లో అప్‌డేట్ చేస్తుంటారు. నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను బట్టి కౌంటింగ్ రౌండ్ల సంఖ్య ఉంటుంది. తక్కువ పోలింగ్ కేంద్రాలున్న నరసాపురం నియోజకవర్గంలో 12 రౌండ్లలోనే ఓట్ల లెక్కింపు పూర్తయ్యి తొలి ఫలితం విడుదల కానుండగా అత్యధిక పోలింగ్ కేంద్రాలున్న భీమవరం, ఉండి, తణుకు నియోజకవర్గాలు చివరగా విడుదల అవుతాయి.

పకడ్బందీగా ఏర్పాట్లు

జిల్లాలో కౌంటింగ్ విజయవంతానికి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ స్థాయిల్లో అధికారులతో ప్రతిరోజు కలెక్టరేట్‌లో సమీక్షలు నిర్వహిస్తూ వారిని సన్నద్ధం చేస్తున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు ఇతరుల వాహనాలకు అనుమతి లేకుండా ఆంక్షలు విధించారు. రిటర్నింగ్ అధికారి మినహా మిగిలిన కౌంటింగ్ స్టాఫ్, రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లు ఎవరికీ లోపలికి మొబైల్ తీసుకెళ్లేందుకు అనుమతిలేదు. అధికారిక కమ్యూనికేషన్ విభాగంలో ఎస్టీడీ, ఫ్యాక్స్, ప్రింటర్ – ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు ప్రధాన ఎన్నికల అధికారికి తక్షణ సమాచారం కోసం హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఉమాబాల



డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను కలిసిన నరసాపురం వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి ఉమాబాల

తాడేపల్లిగూడెం: నర్సాపురం వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణను బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పోలింగ్ సరళి, ఓటింగ్ తీరు తదితర అంశాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఓటర్లు సానుకూలంగా ఓటు వేశారని అభిప్రాయపడ్డారు. నర్సాపురం పార్లమెంటు పరిధిలోని నియోజకవర్గాలలో పోలింగ్ సరళిపై చర్చించారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపుపై అవగాహన

భీమవరం(ప్రకాశంచౌక్): పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్ ఓట్ల లెక్కింపును నిబంధనలకు అనుగుణంగా సజావుగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో నియోజకవర్గాల ఆర్వోలు, ఏఆర్వోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఎంతో ముఖ్యమని, పొరపాట్లకు తావులేని లేకుండా లెక్కింపు పూర్తి చేయాలన్నారు. ప్రతి టేబుల్‌కు నలుగురు సిబ్బందిని నియమించామని, ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్స్, ఒక మైక్రో అబ్జర్వర్ ఉంటారని తెలిపారు. డిక్లరేషన్ వ్యాలిడ్ కాకపోతే పోస్టల్ బ్యాలెట్ ఇన్ వ్యాలిడ్ అవుతుందన్నారు. తుది నిర్ణయం రిటర్నింగ్ అధికారిదేనని స్పష్టం చేశారు.

అల్లర్లపై ఉక్కుపాదం

- ఏలూరులో పోలీస్ 'మాబ్ ఆపరేషన్'
- పర్యవేక్షించిన ఎస్పీ మేరీప్రశాంతి



అల్లరిమూకల ఆందోళన(మాక్‌డ్రిల్)



గొడవలను అడ్డుకునేందుకు సిద్ధంగా పోలీసులు



ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో అల్లరిమూకల నియంత్రణలో ఏఆర్, పోలీస్ బలగాలు

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు జరిగినా.. ఎవరైనా హింసాత్మక చర్యలు, అల్లర్లుకు పాల్పడినా ఏ విధంగా నియంత్రించాలనే అంశంపై జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి పర్యవేక్షణలో ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో పోలీస్ మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ చేపట్టారు. ఏలూరు నగరంలోని పోలీస్ అధికారులు, ఆర్మ్‌డ్ రిజర్వ్ బలగాలు, పోలీస్ సిబ్బంది ఈ మాక్ డ్రిల్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ.. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ విధ్వంసాలకు పాల్పడితే అణిచివేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటామో, ముందుస్తుగా అత్యవసర సమయాల్లో తీసుకునే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించామని స్పష్టం చేశారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉంటారని, అల్లర్లు, గొడవలు, విధ్వంసం సృష్టించేందుకు ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తూ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కౌంటింగ్ రోజు జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన రాజకీయ పార్టీల నాయకులు బాణసంచా కాల్చటం, ర్యాలీలు చేయటం, ఉత్సవాలు, సభలు, సమావేశాలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు లేవని ఎస్పీ స్పష్టం చేశారు. అదనపు ఎస్పీ జీ.స్వరూపరాణి, ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, ఎస్బీ సీఐ మల్లేశ్వరరావు, ఏలూరు టూటౌన్ సీఐ ప్రభాకర్, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, త్రీటౌన్ సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐ నరేంద్ర, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

మహిళ కిడ్నీ నుంచి 80 రాళ్ల తొలగింపు



మహిళ కిడ్నీ నుండి తొలగించిన రాళ్లు

పాలకొల్లు సెంట్రల్: ఓ మహిళకు శస్త్రచికిత్స చేసి కిడ్నీ నుంచి సుమారు 80 రాళ్లను వైద్యులు తొలగించారు. వివరాల్లోకి వెళితే.. నరసాపురానికి చెందిన ఓ మహిళ పట్టణంలోని జనతా ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం వచ్చింది. ఆమెకు పరీక్షలు నిర్వహించగా గత 9 నెలల క్రితం జరిగిన డెలివరి సమయంలో హార్ట్ ఫంక్షనింగ్ తగ్గిపోయింది. దీని నిమిత్తం మందులు వాడుతోంది. అయితే డెలివరి సమయంలో వేసిన కుట్లులో ఒక కుట్టు వద్ద చీము పట్టడంతో నొప్పి వస్తోందంటూ జనతా ఆసుపత్రికి వచ్చారు. ఆమెకు స్కానింగ్ తీయించగా కిడ్నీలో మల్టీపుల్ స్టోన్స్ ఉన్నట్లు వైద్యుడు మిథున్‌చౌదరి గుర్తించారు. రోగి బంధువులకు ఈ విషయం తెలియజేసి శస్త్రచికిత్స చేశారు. లాప్రోస్కోప్ ద్వారా ఆపరేషన్ చేసి కిడ్నీలో ఉన్న సుమారు 80 పైగా రాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా వైద్యుడు మిథున్ చౌదరి మాట్లాడుతూ ఇటీవల కాలంలో కిడ్నీలో ఇన్ని రాళ్లను తొలగించిన కేసు ఇదేనని చెప్పారు. ప్రస్తుతం మహిళ ఆరోగ్యంగా ఉందన్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి



భీమవరంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

భీమవరం: భీమవరం జంక్షన్ రైల్వే స్టేషన్‌లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫారమ్‌పై బుధవారం గుర్తు తెలియని వ్యక్తి మరణించినట్లు జీఆర్‌పీ ఎస్సై పీటీవీ రమణ చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మృతుడి వయస్సు 50 ఏళ్ల వయస్సు ఉండవచ్చని, మరుగుదొడ్లు వద్ద సిమెంట్ బెంచ్‌పై నిద్రిస్తూ మరణించాడన్నారు. తెలుపు రంగు కట్ బనియన్, ముక్కుపొడి రంగు ఫుల్ డ్రాయర్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు 70939 39777 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

రసవత్తరంగా నాటిక పోటీలు

- జీవీఆర్ కళాకేంద్రంలో మూడోరోజు కొనసాగిన ప్రదర్శనలు
- ఆద్యంతం నాటికలను తిలకించి ప్రశంసించిన ప్రేక్షకులు



బీవీఆర్ కళాకేంద్రంలో జ్యోతి ప్రజ్వలన చేసి నాటిక పోటీలను ప్రారంభిస్తున్న నిర్వాహకులు



స్వప్నం రాల్చిన అమృతం నాటికలో ఓ సన్నివేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి 31వ ఉగాది నాటికల పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. బుధవారం మూడో రోజు ప్రదర్శించిన చైతన్య కళాభారతీ, కరీంనగర్ ఆధ్వర్యంలో ×స్వప్నం రాల్చిన అమృతం×, తెలుగు కళా సమితి విశాఖపట్నం వారి ×నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత×, మణికంఠ ఆర్ట్స్, కొండేవరం పిఠాపురం వారిచే ×కొత్తతరం కొడుకు× నాటికలు సందేశాత్మకంగా సాగి ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. అనంతరం జరిగిన సభలో విశ్రాంత ప్రిన్సిపాల్, నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్యకు, బళ్ళారి అడ్వకేట్ కె.కోటేశ్వరరావుకు, ఆంధ్ర భాషాభివర్ధని ఒరిస్సా పూడిపెద్ది సత్యనారాయణలకు గౌరవ విశిష్ట సేవా పురస్కారాలు అందజేశారు. బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు పర్యవేక్షించారు. పట్టణ ప్రముఖులు, కళాకారులు, సాహితీ సభ్యులు, స్థానిక ప్రజలు హాజరై నాటికలను తిలకించారు.

స్వప్నం రాల్చిన అమృతం

ఒక కాకికి దెబ్బ తగిలి కింద పడితే అన్ని కాకులు చుట్టూ చేరి కావుకావు అంటూ అరుస్తాయి. వాటి మధ్య ఏబంధాలు, సంబంధాలు లేకపోయినా సాటి కాకిగా గొప్ప సానుభూతి చూపిస్తాయి. అదే విధంగా భార్యాభర్తల అనుబంధానికి విలువనిచ్చే మనుషులమైన మనం ఆ కాకుల్లో ఉన్న కనీస జ్ఞానం మనలో లేకపోతే ఎలా అని తెలియజేప్పేదే ×స్వప్నం రాల్చిన అమృతం×. పాత్రధారులు కత్త కొండ సత్యనారాయణ, సుప్రియ, జ్యోతి, రమేష్ మంచాల, సంగీతం సురభి నాగరాజు. దీనికి మూలకథ పీఎస్ నారాయణ, నాటకీకరణ, రచన పరమాత్ముని శివరాం, దర్శకత్వం రమేష్ మంచాల వహించారు.

నిశ్శబ్దమా...నీ ఖరీదెంత

కుమార్ తండ్రి ఓ విప్లవ రచయిత. విప్లవ భావాలున్న ఆ తండ్రి తన కొడుకు కుమార్‌కు మరో రచయిత కూతుర్ని ఇచ్చి ఆదర్శ వివాహం చేస్తాడు. కానీ ఆమె అతనితో ఇమడలేకపోతుంది. కుమార్ తన తల్లిదండ్రులను ప్రేమగా చూసుకోవడం ఆమె భరించలేకపోతుంది. కన్న కూతుర్ని తీసుకెళ్ళిపోతుంది. అక్రమ సంబంధం ఏర్పరచుకుంటుంది. 498 ఏ ఐపీసీ కేసులు, మనోవర్తి కేసులు వేస్తుంది. కుమార్ తన కూతుర్ని ఇచ్చేయాలని అడుగుతాడు. చట్ట ప్రకారం పోరాడుతుంటాడు. ఇదిలా ఉంటే వాళ్ల అక్రమ సంబంధానికి, ఆనందానికి అడ్డంగా ఉన్న పాపను అంతమొందిస్తారు. దీంతో అలసిపోయిన కుమార్ కన్నెర్ర చేస్తాడు. సామాన్యుడు అసామన్యుడౌతాడు. ఉగ్రరూపం చూపిస్తాడు. ఈ సమాజంలో అత్యధిక హత్యలు అక్రమ సంబంధాల వల్లే జరుగుతున్నాయని ఒక సర్వే చెప్పింది. ఇక చట్టమే ఆ స్వేచ్ఛనిస్తే ఇక వీటిని ఆపేదెవరు... ఈ సమాజం ఎటుపోతుంది...దీన్ని ఎవరూ ప్రశ్నించరే అనే ప్రశ్నల నుంచి రాయబడిందే నాటిక నిశ్శబ్దమా నీ ఖరీదెంత? నాటిక, రచన పీటీ మాధవ్, దర్శకత్వం చలసాని కృష్ణప్రసాద్.

కొత్తతరం కొడుకు

తల్లిదండ్రులు తమ పాతభావాలతో, పట్టుదలతో పిల్లల్ని బాధపెడుతున్న సందర్భాలు కూడా ఉంటున్నాయి. పిల్లల్ని పెంచడం, పోషించడం తల్లిదండ్రుల బాధ్యత. అదే బాధ్యత తమ పిల్లలకి కూడా ఉంటుందని ఎంతో మంది తల్లిదండ్రులు మరిచిపోతున్నారు. ఒంటిరిగా ఉన్న వృద్ధులపై ఎక్కువ అఘాయిత్యాలు జరుగుతున్నాయి. వయస్సు మీద పడిన తల్లిదండ్రులు కాస్త కష్టమైనా తమ పిల్లల దగ్గరే ఉండాలి అని చెప్పడమే ×కొత్తతరం కొడుకు× నాటిక ఉద్దేశం. మణికంఠ ఆర్ట్స్, కొండేవరం పిఠాపురం వారి నాటిక మూల కథ రావు కృష్ణారావు, రచన, దర్శకత్వం చెలికాని వెంకట్రావు.

డ్రింక్స్ తయారీదారులపై విజిలెన్స్ దాడులు



భీమవరంలో డ్రింక్స్ తయారీ కేంద్రంపై దాడులు నిర్వహించిన విజిలెన్స్ అధికారులు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరంలో అనుమతులు లేకుండా సాఫ్ట్ డ్రింక్స్ తయారుచేస్తున్న కేంద్రంపై విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్ (ఏలూరు) ఆదేశాల మేరకు భీమవరం పట్టణంలోని సాంబశివ సాఫ్ట్‌డ్రింక్స్ తయారీ కేంద్రంపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. యజమాని గోతం సుధీర్ బాబు అనధికారికంగా అనుమతులు లేకుండా లెమన్ సాఫ్ట్ డ్రింక్స్‌ను పెద్ద మొత్తంలో తయారు చేసి, వాటిని సీసాలలో భారీగా నిల్వ చేసి వాహనాల్లో చుట్టుపక్కల పట్టణాలు, గ్రామాలకు సరఫరా చేస్తున్నట్టుగా గుర్తించారు. అతనికి కూల్‌డ్రింక్స్ తయారు చేయడానికి ఏవిధమైన అనుమతులు లేవని తేల్చారు. డ్రింక్స్ నమూనాలు సేకరించి ఫుడ్ పరీక్ష కేంద్రానికి పంపించారు. తూనికలు, కొలతల శాఖ నుంచి అనుమతులు లేనట్లు గుర్తించి సంబంధిత సెక్షన్ల ప్రకారం సుధీర్‌బాబుపై కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్సు డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు, విజిలెన్స్ సీఐ విల్సన్, ఫుడ్ సేఫ్టీ అధికారి సుందర రామిరెడ్డి, తూనికలు కొలతల శాఖ అధికారి రాం బాబు పాల్గొన్నారు.

చోరీకి బిహార్ దొంగల యత్నం

ఆగిరిపల్లి: మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో మంగళవారం అర్ధరాత్రి బిహార్ దొంగలు చోరీకి యత్నించగా, స్థానికులు కేకలు వేయడంతో పరారయ్యారు. వివరాలిలా ఉన్నాయి. ఆగిరిపల్లిలోని అను డీలక్స్ సినిమా థియేటర్ వద్ద వీధిలో ఇద్దరు వ్యక్తులు శరీరానికి ఆయిల్ రాసుకుని ఆయుధాలతో దొంగతనానికి ప్రయత్నించగా స్థానికులు దొంగలను చూసి కేకలు వేశారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. గుర్తు తెలియని వ్యక్తులు బిహార్‌కు చెందిన వారిగా ఉన్నారని తెలిపారు. అయితే గ్రామంలో బిహార్ దొంగలు సంచరిస్తున్నారనే విషయం వెలుగులోకి రావడంతో స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రాత్రిపూట పోలీసుల గస్తీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇద్దరు మహిళలకు గాయాలు

జంగారెడ్డిగూడెం రూరల్: తాడువాయి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఇటుకలు లోడుతో వెళుతున్న ట్రాక్టర్ పైనుంచి ఓ ఇటుక జారి రోడ్డుపై పడింది. ట్రాక్టర్ వెనుక ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరు మహిళలు ఈ ఇటుక పైనుంచి వాహనం వెళ్లడంతో అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఆగిరిపల్లి: కడుపునొప్పి తట్టుకోలేక ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. పోతవరప్పాడుకు చెందిన ప్రత్తిపాటి కోటేశ్వరరావు (58) కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం రాత్రి కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న సుబ్బారావును విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చిలక జ్యోతిష్యుడి అవతారం ఎత్తావా ?

టీడీపీ ఉండి అభ్యర్థి రఘురామపై వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు మండిపాటు

ఏలూరు టౌన్: సంక్షేమ పాలనతో దేశానికే ఆదర్శంగా నిలిచి, రాష్ట్రంలోని కోట్లాది మంది ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి టీడీపీ ఉండి అభ్యర్థి రఘురామకృష్ణరాజుకు లేదని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అయన ఏలూరులో ఒక ప్రకటన విడుదల చేశారు. ఉండి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలిచే సత్తా లేని రఘురామకృష్ణరాజు చిలకజోతిష్యుడి అవతారం ఎత్తాడని ఎద్దేవా చేశారు. జూన్ 4న ఎన్నికల కౌంటింగ్‌లో రాష్ట్రవ్యాప్తంగా మెజారిటీ స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంటుందని, ఉండిలో రఘురామకృష్ణరాజు ఓటమి ఖాయమన్నారు. రాజకీయ జీవితం ప్రసాదించిన పార్టీకే వెన్నుపోటు పొడిచావనే విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. ఎన్ని సీట్లు వస్తాయో చెప్పటానికి నువ్వు ఏమైనా దైవాంశసంభూతుడివా అంటూ ప్రశ్నించారు. ఉండి ప్రజల నుంచి రిటర్న్ గిఫ్ట్ తీసుకునేందుకు రెడీగా ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండి నియోజకవర్గంలో పార్టీ తరపున అభ్యర్థిగా పీవీఎల్ నర్సింహ రాజుకు మాండేట్ ఇచ్చారనీ, ఆయన పైనే గెలవలేని నువ్వా వైఎస్ జగన్‌ను విమర్శించేది అన్నారు. రాజకీయాల్లో విలువలకు కట్టుబడి జీవించే క్షత్రియులకు మచ్చతెచ్చేలా అనైతిక రాజకీయాలు చేయటానికి సిగ్గులేదా అని నిలదీశారు. జూన్ 4న కౌంటింగ్ అనంతరం భవితవ్యం ఏమిటో చూసుకోవాలనీ, వైఎస్సార్ సీపీ గురించి, లేదా నాయకుల గురించి అవాకులు చెవాకులు పేలితే సహించేది లేదని ప్రసాదరావు హెచ్చరించారు.

పండ్ల సాగులో సాంకేతికత అవలంబించాలి

- నూజివీడు మామిడి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి
- మామిడి రైతు సదస్సు, ఉద్యాన పంటల ప్రదర్శన



నూజివీడు మామిడి పరిశోధన స్థానం ఆవరణలో ఉద్యాన ప్రదర్శనను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

నూజివీడు: పండ్ల తోటల సాగులో నూతన శాస్త్రీయ సాంకేతిక పద్ధతులను రైతులు అందిపుచ్చుకోవాలని నూజివీడు మామిడి పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త బొర్రా కనకమహాలక్ష్మి అన్నారు. వెంకటరామన్నగూడెంలోని బీఎస్సీ హార్టీకల్చర్ కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థినులు పని అనుభవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మామిడి పరిశోధన స్థానం ఆవరణలో బుధవారం మామిడి రైతుల సదస్సును నిర్వహించడంతో పాటు ఉద్యాన ప్రదర్శనను నిర్వహించారు. దీనిలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కనకమహాలక్ష్మి మాట్లాడుతూ ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలు అందించే సూచనలు, సలహాలు పాటించడం ద్వారా నాణ్యమైన పండ్ల ఉత్పత్తులను సాధించాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల మామిడిలో పండు ఈగ ఉధృతి ఎక్కువైందని, దీని నివారణకు మామిడితోటల్లో ఎకరాకు ఐదు నుంచి ఆరు పండుఈగను ఆకర్షించే బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే రాలిన పండ్లను ఏరి నేలలో పాతిపెట్టాలన్నారు. మామిడిలో పాటించాల్సిన సస్యరక్షణ పద్ధతులను కృష్ణా జిల్లా ఉద్యాన అధికారిణి జే జ్యోతి, హార్టికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మి వివరించారు. మామిడిలో పోషక, నీటి యాజమాన్య పద్ధతులపై ఉద్యాన శాస్త్రవేత్త రాధారాణి అవగాహన కల్పించారు. మామిడి కాయలను మగ్గపెట్టడానికి హానికరమైన రసాయనాలు వాడకుండా ఇథలీన్ వాయువు, ప్యాకెట్‌ను వాడాలని సూచించారు. మామిడిలో పురుగుల యాజమాన్యం గురించి కీటకశాస్త్రవేత్త జీ శాలిరాజు వివరించారు.

ఆకట్టుకున్న ఉద్యాన ప్రదర్శన

హార్టికల్చర్ విద్యార్థులు ఏర్పాటు చేసిన పండ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. రాష్ట్రంలో రైతులు సాగుచేసే మామిడి రకాలు, వాటి ఉప ఉత్పత్తులను ప్రదర్శించి తెలియని రకాలను ఎన్నింటినో తెలియజేశారు. అలాగే తక్కువ ఖర్చుతో మామిడి పండ్లను మాగబెట్టడం, సమీకృత వ్యవసాయం, నేలల పరిరక్షణ, మామిడిలో పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, వర్మీ కంపోస్టు, సోలార్ ఇరిగేషన్, సోలార్ ఫెన్సింగ్, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర్ పంటల సాగు, పుట్టగొడుగుల పెంపకం తదితర వాటికి సంబంధించిన నమూనాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ఉద్యాన అధికారిణి ఆర్.హేమ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

పెదవేగి: దీర్ఘకాలంగా వస్తున్న కడుపునొప్పిని తట్టుకోలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పెదవేగి ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం ముండూరు శివారు బొడ్డువారిగూడేనికి చెందిన వివాహిత బడుగు ధనలక్ష్మి (40) చాలాకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. బుధవారం మధ్యాహ్నం తీవ్రమైన నొప్పి రావడంతో తట్టుకోలేక ఇంటి దూలానికి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతదేహాన్ని శవపరీక్షకు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించామని ఎస్‌ఐ తెలిపారు. అయితే ధనలక్ష్మి మృతిపై గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉరి వేసుకుంటే మృతదేహం వేలాడుతూ ఉండాలి కానీ, ధనలక్ష్మి చేతులు నేలను తాకేలా ఉన్నాయని, ఇది ఆత్మహత్య కాదని, హత్యేనని ప్రచారం జరుగుతోంది. మృతురాలి కుమారుడు సాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజేంద్రప్రసాద్ చెప్పారు.

తేనెటీగల పెంపకంపై శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉండి: అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రంలో తేనెటీగల పెంపకంపై 25 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ మల్లికార్జునరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జూన్ మొదటి వారంలో ప్రారంభించే శిక్షణా కార్యక్రమం కొరకు కేవలం 20 మందిని మాత్రమే ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తిగల వారు నేరుగా కేవీకేకు వచ్చి గాని లేదా 82477 06799, 88986 23823 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. శిక్షణలో తేనెటీగల పెంపకంతో పాటు మైనం, పుప్పొడి సేకరణ, మిద్దె తోటల్లో కుట్టని తేనెటీగల పెంపకం, రాయల్ జెల్లీ, తేనెటీగల ప్రోపోలిస్ తదితర విషయాలపై విపులంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా క్షేత్రస్థాయి పర్యటనలతో మరింత అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు.

ఇద్దరిపై విద్యుత్ చౌర్యం కేసుల నమోదు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేవరపల్లి మండలం యర్నగూడెం సెక్షన్ యాదవోలులో అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారని అందిన సమాచారం మేరకు ఏలూరు విద్యుత్ విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు చేసి ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీ సమయంలో దాండ్రు రాంబాబు తన గృహంలోని ఏసీలకు విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. అలాగే ప్రగడ సుబ్బారావు అనే వ్యక్తి తన వాటర్‌ప్లాంట్‌కు అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్నట్లు గుర్తించామన్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వీరిపై కేసులు నమోదు చేసి వారికి రూ.2,25,039 అపరాధ రుసుము, రూ.28 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

అశ్లీల వీడియో తీసిన నలుగురి అరెస్ట్

మండవల్లి: ఓ బాలిక, బాలుడిపై అసభ్యకర వీడియో తీసి వాట్సాప్‌లో ఫార్వర్డ్ చేసిన నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై రామచంద్రరావు బుధవారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా మండవల్లి మండలం పులపర్రు గ్రామానికి చెందిన బాలికను ఈనెల 15న మధ్యాహ్నం 12 గంటలకు ఆమె స్నేహితురాలు చింతపాడు హైస్కూల్ వద్దకు రమ్మనగా వెళ్లింది. అక్కడ చింతపాడుకు చెందిన ఓ బాలుడు ఆమెను స్కూల్‌లోని తరగతి గదిలోకి తీసుకువెళ్లాడు. అక్కడ వీరిద్దరూ శారీరకంగా కలవగా కొందరు వీడియో తీశారు. ఈ వీడియో వాట్సాప్‌లో ఫార్వర్డ్ చేయగా ఈనెల 21న వీడియో వైరల్ అయ్యింది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కై కలూరు రూరల్ సీఐ బి.కృష్ణకుమార్ బాధ్యుడైన బాలుడిని విజయవాడ జువైనెల్ హోమ్‌కు తరలించారు. వీడియో తీసి ఫార్వర్డ్ చేసిన నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి కై కలూరు కోర్టులో హాజరుపరిచారు.

చేలో వరి గడ్డికి నిప్పుతో చేటు

- చేలల్లో వరిగడ్డి తగలబెడితే ఎన్నో అనర్థాలు
- మిత్ర కీటకాలు, మిత్ర శిలీంద్రాలు చనిపోతాయి
- భూమిలో నత్రజని, పాస్ఫరస్ కోల్పోయే ప్రమాదం
- ఉమ్మడి జిల్లాలో 5.40 లక్షల ఎకరాల్లో వరి సాగు



వరిచేలో గడ్డిని తగలబెడుతున్న దృశ్యం

భీమవరం: వరిచేలలో ఎండుగడ్డి, వరిమోళ్లను తగలబెట్టడం వల్ల తీవ్ర నష్టం ఏర్పడుతుందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేడి వల్ల భూమిలో ఉన్న మిత్ర కీటకాలు, శిలీంద్రాలు చనిపోయి పైరుకు నష్టం కలుగుతుంది. వరి సాగులో కూలీల కొరతను అధిగమించడానికి, సాగు ఖర్చులు తగ్గించుకోడానికి రైతులు ఎక్కువగా యంత్రాలను వినియోగిస్తున్నారు. కోత యంత్రాల ద్వారా మాసూళ్లు చేస్తున్న పంటలో వరిగడ్డి, మోళ్లను చేలోనే తగలబెట్టడం ఇటీవల పరిపాటిగా మారింది. వరిచేలో గడ్డిని తగలబెట్టడం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని వ్యవసాయశాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 5.40 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. వరి మాసూళ్లలో వరికోత యంత్రాలను ఉపయోగించడంతోపాటు పశువుల సంఖ్య తగ్గడం, కూలీల ఖర్చు పెరగడంతో వరిగడ్డిని గతంలో మాదిరిగా రైతులంతా ఒబ్బిడి చేయడం లేదు. దీంతో యంత్రాలతో మాసూళ్లు చేసిన చేలలో గడ్డిని కొంతమంది రైతులు తగలబెడుతున్నారు. గడ్డిని తగలబెట్టే పద్ధతి గతంలో కేవలం పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలలో మాత్రమే ఉండేది. ప్రస్తుతం ఈ పద్ధతి దేశమంతా పాకింది.

నష్టాలు ఇవే..

రైతులు పొలంలో గడ్డిని మండించడం వల్ల కలిగే వేడి భూమిలో సుమారు సెంటిమీటరు లోతు వరకు వెళుతుంది. దీనివల్ల క్రమేపీ భూములు నిర్జీవంగా మారిపోతాయి. అంతేగాకుండా వేడి వల్ల మిత్ర కీటకాలు, మిత్ర శిలీంద్రాలు చనిపోయి పంటలను ఆశించే చీడపీడల ఉధృతి క్రమేపీ పెరిగిపోతుంది. టన్ను గడ్డిని తగులబెట్టడం వల్ల నేలలో 5.5 కిలోల నత్రజని, 2.3 కిలోల పాస్ఫరస్, 2.5 కిలోల పొటాషియం, 1.0 కిలోల సల్ఫర్‌తోపాటూ నేలలో ఉండే సేంద్రియ కర్బనాన్ని కూడా కోల్పోతుందని శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలలో తేలింది. అంతేగాకుండా గడ్డిని తగలబెట్టడం ద్వారా వ్యాపించే పొగ వల్ల 76 శాతం మందికి కళ్ల మంటలు, 44.8 శాతం మందికి ముక్కులో మంట, 45.5 శాతం మంది గొంతు నొప్పి బారిన పడినట్టుగా గుర్తించారు. అంతేకాక గడ్డి తగలబెట్టడం వల్ల వచ్చే పొగను పీల్చడం వల్ల నుశి ఊపిరి తిత్తులలో పేరుకుపోయి ఆస్తమా తదితర శ్వాస సంబంధ రుగ్మతలు ఏర్పడుతున్నట్టుగా పరిశోధనల్లో గుర్తించారు. పంజాబ్ రాష్ట్రంలో పొలంలోని వ్యర్థాలను కాల్చడం వల్ల వచ్చే పొగ ద్వారా కలిగే అనారోగ్యాలను నివారించడానికి ప్రభుత్వం ప్రతి ఏటా రూ.7.6 కోట్లు ఖర్చు చేస్తుండడం గమనార్హం.

పంట వ్యర్థాల సమర్థ వినియోగానికి ప్రత్యామ్నాయాలు

ప్రస్తుతం పంట వ్యర్థాల సమర్థ వినియోగంపై శాస్త్రవేత్తలు విస్తృత పరిశోధనలు చేస్తున్నారు. పొలంలో మిగిలిన గడ్డిని కంపోస్ట్ చేయడం వల్ల ఎంతో విలువైన సేంద్రియ ఎరువు తయారవుతుంది. సేంద్రియ ఎరువుల వినియోగం పర్యావరణ హితమైన వేగాక సాగు ఖర్చును తగ్గించుకోవచ్చు. వరి గడ్డిని పుట్టగొడుగుల పెంపకంలో బెడ్డింగ్ మెటీరియల్‌గా ఉపయోగపడుతుంది. అంతేగాక కొన్ని ప్రైవేటు సంస్థలు వరిగడ్డిని ఉపయోగించి ప్యాకింగ్ మెటీరియల్, కార్డ్ బోర్డులు, ప్లేట్స్, స్పూన్లు, బయో-ఇథనాల్ వంటి విలువ ఆధారిత ఉత్పత్తులు తయారుచేస్తున్నందున గడ్డిని విక్రయించుకోవడం ద్వారా కొంత ఆదాయం పొందవచ్చును.



గడ్డిని తగలబెట్టడంతో ఏర్పడిన బూడిద

రైతుల్లో అవగాహన పెరగాలి



చేలలో వరిగడ్డిని తగలబెట్టడం వల్ల అనేక అనర్థాలున్నాయి. గడ్డి తగలబెట్టిన వేడి వల్ల భూమికేగాకుండా మనుషులకు తీవ్ర నష్టాలున్నాయి. గడ్డిని సమర్థంగా వినియోగించుకోవడం వల్ల పర్యావరణానికి మేలు కలగడమేగాక రైతులు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు. వరి గడ్డిని చేలలో దుక్కిదున్నడం వల్ల పైరుకు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది. రైతుల్లో అవగాహన పెరగడం వల్లనే ఇది సాధ్యం.

– డాక్టర్ ఎంవీ కృష్ణాజీ, ప్రధాన శాస్త్రవేత్త, మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం

నేటి తరాలకు స్ఫూర్తి కలిగించేందుకే..



తణుకు వైఎస్సార్ పార్కు గోడపై ఏర్పాటు చేసిన దేశ నాయకుల విగ్రహాలు



తణుకు బ్యాంక్ కాలనీలో ఏర్పాటుచేసిన స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలు


- తణుకులో స్వాతంత్య్ర సమరయోధులు, దేశ నాయకుల విగ్రహాలు ఏర్పాటు
- రెండు ప్రాంతాల్లో 36 విగ్రహాలు
- వారందరికీ ఘన నీరాజనాలు

తణుకు అర్బన్: స్వాతంత్య్ర సమరయోధులు, దేశ నాయకులు పుట్టి, నడిచిన ప్రాంతంగా తణుకు ప్రాంతం చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖింపబడింది. అటువంటి తణుకు నేల నాటి యోధుల చరిత్ర తెలిపే విధంగా వారి విగ్రహాలకు వేదికైంది తణుకు గడ్డ. భారత దేశ స్వాతంత్రోద్యమ పోరాటంలో మహానుభావులు వారి జీవితాలు త్యాగం చేసి అమరవీరులుగా ప్రజల హృదయాల్లో గూడు కట్టుకున్నారు. తణుకు వాసులెందరో జైలు జీవితాన్ని అనుభవించారు. ఆనాటి స్వాతంత్య్ర ఉద్యమంలో భాగంగా జాతిపిత మహాత్మాగాంధీ రెండు పర్యాయాలు తణుకులో అడుగుపెట్టి ఉద్యమ స్ఫూర్తిని రగిలించగా, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కొంతకాలం విద్యాభ్యాసాన్ని చేసిన ప్రాంతంగా తణుకు ప్రాంతం దేశ చరిత్రలోనే ఖ్యాతి సాధించింది. అటువంటి మహనీయుల స్ఫూర్తితో స్వాతంత్రోద్యమ పోరాటంలో ఉద్యమాన్ని నడిపి జైలు జీవితం గడిపిన అమరవీరులు తణుకులో 30 మందికిపైగా ఉన్నారు. వారి వీరోచిత పోరాట ప్రతిమను నేటి బాలలకు, తణుకుతో పాటు చుట్టు ప్రక్కల గ్రామవాసులకు సైతం తెలియచెప్పాలనే తలంపుతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తణుకు బ్యాంక్ కాలనీలోని పార్కుకు స్వాతంత్య్ర సమరయోధుల ఉద్యానవనంగా నామకరణం చేయించి యువత, నేటి బాలబాలికలకు స్ఫూర్తి కలిగే విధంగా స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయించారు.

18 విగ్రహాలు..

తణుకు బ్యాంక్ కాలనీలోని స్వాతంత్య్ర సమరయోధుల ఉద్యానవనంలో 18 మంది తణుకుకు చెందిన స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేసి 2023లో విగ్రహావిష్కరణలు చేశారు. తణుకు ప్రాంతంలో 30 మంది పైగా ఉన్నప్పటికీ సేకరించిన వివరాల ప్రకారం మునిసిపల్ నిధులు రూ. 10 లక్షలతో 18 మంది విగ్రహాలను తయారు చేయించి పార్కు ప్రాంతాన్ని అభివృద్ధి చేశారు.

దేశ నాయకుల విగ్రహాలతో



తణుకు వైఎస్సార్ పార్కు గోడపై అల్లూరి సీతారామరాజు విగ్రహం

స్ఫూర్తిదాయకంగా వైఎస్సార్ పార్కు

తణుకు పట్టణంలోని వంగవీటి మోహనరంగా వీధిలోని వైఎస్సార్ పార్కులో ఏర్పాటు చేసిన దేశ నాయకుల విగ్రహాలు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. దేశ చరిత్రలో ఎందరో మహానుభావులు దేశం కోసం సేవలందించి అసువులు బాశారు. వారి జీవన విధానాన్ని పాఠ్యాంశాల్లో ఉంచినప్పటికీ వారి రూపాన్ని తణుకులో నేటి తరానికి గుర్తు చేయాలనే ఉద్దేశ్యంతో మంత్రి కారుమూరి దేశ నాయకుల వివరాలను సేకరించి మునిసిపల్ నిధులతో 18 మంది విగ్రహాలు ఏర్పాటు చేసి వారి పేరు చరిత్ర సుస్పష్టం చేశారు. ముఖ్యంగా మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, కవియిత్రి మొల్ల, గుర్రం జాషువా, కృష్ణదేవరాయులు, బ్రహ్మనాయుడు, టంగుటూరి ప్రకాశం పంతులు, వీరేశలింగం పంతులు, వేమన వంటి నాయకుల విగ్రహాలు పార్కు ప్రహరీపై కొలువుతీరాయి. దీంతో ఆ నాయకుల జయంతి, వర్ధంతి కార్యక్రమ రోజుల్లో పలు సేవా సంఘాలు ఆ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తుంటారు. అంతేకాకుండా గాంధీ మహాత్ముడు చేపట్టిన దండిమార్చ్ ఉద్యమాన్ని ప్రజలు, చిన్నారులకు తెలిపే క్రమంలో ఆ నమూనాను అందులో అప్పటి తరం పడ్డ ఇబ్బందులను కళ్లకు కట్టినట్లుగా విగ్రహాల రూపంలో ఉంచారు. దీంతో తణుకు ప్రాంతం దేశ నాయకులు, స్వాతంత్య్ర సమరయోధుల గడ్డగా అవతరించిందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రీస్తు ఆధ్యాత్మిక దర్శనం పొందాలి

పెంటపాడు: క్రీస్తు ఆద్యాత్మిక దర్శనం పొందేందుకు విశ్వాసులు పాటు పడాలని అంతర్జాతీయ సువార్తికులు కొండవీటి బాబూరావు పేర్కొన్నారు. పడాల మార్కెట్ యార్డు సమీపంలో బేతిరెడ్డి అమ్మిరెడ్డి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే కార్యక్రమంలో భాగంగా ఆయన దేవుని వాక్యం బోధించారు. పడాల వాక్యజ్యోతి చర్చి ఆధ్వర్యంలో క్రీస్తు సంపూర్ణ సువార్త సభల బుధవారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు చేసి ప్రవక్తిని కె. అమ్మాజీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుంటూరుకు చెందిన అంతర్జాతీయ సువార్తికులు కొండవీటి బాబూరావు దేవుని వాక్యం బోధించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాలలో జిల్లా పాస్టర్ల సంఘ అధ్యక్షుడు కె. జాజిరాజు, విశాఖపట్నంకు చెందిన దైవసేవకులు శామ్యూల్ కర్మోజి, గుడివాడకు చెందిన కిరణ్‌పాల్, గాయకులు సిరివెళ్ల హనోక్, కొమ్మిశెట్టి ఘనరాజు తదితరులు పాల్గొంటారన్నారు. ఈ సభలను పరిసర గ్రామాల ప్రజలు, విశ్వాసులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా జాజిరాజు కోరారు.

నేడు బలుసులమ్మ ఆలయంలో వైశాఖ పౌర్ణమి పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయంలో ఈ నెల 23వ తేదీ గురువారం ఉదయం 8 గంటల నుంచి వైశాఖ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి 108 నూతన కలశములతో సప్త నది జలాలతో అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ, ఉత్సవ కమిటీ సభ్యులు వెల్లడించారు. పంచలోహ సీతా రామ లక్ష్మణ ఆంజనేయ ఉత్సవ విగ్రహాలకు సంప్రోక్షణ, నూతన రథశాల ప్రారంభం చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు పూజా కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారి కృపకుపాత్రులు కావాలని కోరారు.

క్లుప్తంగా

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆర్టీసీ డిపో వద్ద వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వాడపల్లి వెంకట అనంత కృష్ణమాచార్యులు, పెదపూడి గోపాలాచార్యులు బ్రహ్మత్వం వహించారు. ఆలయ ధర్మకర్త మలిశెట్టి పద్మశ్రీ పూజలలో పాల్గొన్నారు. మందిర అభివృద్ధి కమిటీ చైర్మన్ కూనిరెడ్డి శ్రీనివాస్, సభ్యులు పీటీ వెంకన్న, దాసరి భాస్కరరావు, మాదిరెడ్డి మురళీ తదితరులు కళ్యాణాన్ని పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



ప్రత్తిపాడు 3ఎఫ్ కర్మాగారం ఎదుట నిరసన చేస్తున్న వర్కర్స్

పెంటపాడు: పెంటపాడు మండలంలోని ప్రత్తిపాడులోని 3ఎఫ్ కర్మాగారంలో కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సీఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు శిరపరపు రంగారావులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ కార్మికులు కర్మాగారం ప్రధాన గేటు వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు బుధవారం కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 3ఎఫ్ యాజమాన్యం కార్మికులపై చూపిస్తున్న మొండి వైఖరి వీడి కొత్త వేతనాలను అమలు చేయాలన్నారు. యాజమాన్యం మొండి వైఖరి విడనాడకపోతే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున సమ్మె చేస్తామన్నారు. రైల్వే గూడ్సు, అపరాలు, ఉల్లిపాయల జట్టు కార్మికులు, ఎరువుల ట్రాన్స్‌పోర్టు, అపరాల జట్టు వర్కర్లు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి కర్రెడ్ల రామకృష్ణ, పెనుమాక శ్రీనవాస్, పట్టణ అధ్యక్షులు జవ్వాది శ్రీను,వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి. గణేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

తణుకు టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రకృతితో మనిషి మమేకమై జీవ వైవిధ్యాన్ని కాపాడాలని తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటనీ డిపార్టమెంట్ హెడ్ పీ చాముండేశ్వరి దేవీ చెప్పారు. బుధవారం తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా జీవ వైవిధ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ, మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నివారణ గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ కృష్ణానందం, అక్కిన కాశీ విశ్వనాథం, ఎంపీ సూర్యనారాయణ, వడ్లమాని పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా వాహనాల నిలిపివేతతో ఇబ్బందులు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో ఇష్టానుసారం ప్రైయివేట్ వాహనాలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రైల్వే స్టేషన్‌రోడ్‌లో ఇటీవల కాలంలో రద్దీ బాగా పెరిగింది. పాలకొల్లు రోడ్ విపరీతమైన రద్దీతో ఉండటంతో, చాలామంది ప్రత్యామ్నాయంగా, ఈ రోడ్‌లో ప్రయాణిస్తున్నారు. ఇటీవల స్టేషన్ పక్క నుంచి సరిపల్లి మీదుగా బైపాస్ కూడా నిర్మించారు. దీంతో రద్దీ బాగా పెరిగింది. అయితే ఈ రోడ్‌లో ప్రైవేట్ బస్సులు, రొయ్యల కంపెనీలకు సంబంధించిన ఇతర ప్రైవేట్ వాహనాలను ఇరువైపులా నిలిపి ఉంచుతున్నారు. అందువల్ల ఈ రోడ్డులో ప్రయాణించే వారికి సమస్యలు వస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి వాహనాలను రోడ్డుపై నిలిపి ఉంచకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

భీమవరం అర్బన్: భీమవరం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పత్రిపాటి శ్రీను, ప్రధాన కార్యదర్శిగా సత్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భీమవరంలోని మండల ఆర్యవైశ్య సంఘం బుధవారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోశాధికారిగా శ్రీకాంత్, సభ్యులుగా సోము కపర్థి, మండ వెంకయ్య, బచ్చు కాశీ, బలబద్ర బాబి, జూలూరు నాగేశ్వరరావు, పత్రిపాటి వెంకటపుల్లారావు, ఆలమూరు మల్లిఖార్జునరావు, ఒబిలిశెట్టి రంగారావు, సబ్బిశెట్టి రాంబాబు, మండవల్లి సత్యానారాయణ, సోము రంగప్రసాద్, జూలూరి బాల బాలాజీ, తవ్వ సాయి సభ్యులుగా ఎన్నికయ్యారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం



లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరులో పునః నిర్మిస్తున్న నూతన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద బుధవారం రాత్రి స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అగ్నిహోత్రం సుందర రామానుజాచార్యులు, మాధవాచార్యులు, అర్చక స్వాములు బ్రహ్మత్వం వహించారు. దామోజీపురపు కుమార వెంకట నరసింహ అప్పారావు దంపతులు పూజలలో పీటలపై కూర్చున్నారు. కల్యాణ తంతు నిర్వహించారు. విశేష పూజలు జరిగాయి. దేవాదాయ ధర్మాదాయ శాఖ, ట్రస్టుబోర్డు సభ్యులు, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, కమిటీ చైర్మన్ కె.శ్రీనివాస్, సత్సంగ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వెంకట్రామన్నగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు నిమిత్తం గురువారం ఉదయం 7నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.

రంజు భలే.. తాటి ముంజెలే..

- తణుకులో తాటి ముంజెల సందడి
- వేసవి తాపం తీరుస్తుందనే నమ్మకం
- వైద్యపరంగాను తినాలంటున్న వైనం
- జోరుగా తాటి ముంజెల విక్రయాలు



తణుకు స్త్రీసమాజం రోడ్డులో తాటి ముంజెల దుకాణం



తణుకు స్త్రీసమాజం రోడ్డులో తాటి ముంజెలు తీస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: రంజు భలే తాటి ముంజెలే అన్నట్లుగా ఈ వేసవి ప్రారంభం నుంచి తణుకు వీధుల్లో తాటి ముంజెలు హల్‌చల్ చేస్తున్నాయి. సీజనల్‌గా ప్రతి ఏడాది వేసవి ప్రారంభం కాగానే మార్కెట్‌లో దర్శనమిచ్చే ముంజెలు కొనుగోలు చేసేందుకు ప్రజలు పోటీ పడుతున్నారు. ముఖ్యంగా తణుకు స్త్రీసమాజం రోడ్డులో అధిక సంఖ్యలో ముంజెల విక్రయాలు జరుగుతుండగా, వేల్పూరు రోడ్డు, ఉండ్రాజవరం రోడ్డు, రాష్ట్రపతి రోడ్డులో సైతం ఈ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వేసవి తాపాన్ని తీరుస్తాయనే ఉద్దేశ్యంతో వేసవిలో మాత్రమే లభించే ఈ ముంజెల కొనుగోలు చేసేందుకు ప్రియులు వేచిచూసి మరీ తీసుకువెళ్తున్నారు.

కొబ్బరితీత కార్మికుల విక్రయాలు...

తణుకులో కొబ్బరితీత కార్మికులు వేసవి రాగానే కొబ్బరి కాయలను దించే పనికి స్వస్తి చెప్పి ముంజెలను విక్రయించేందుకు సిద్ధమవుతారు. ఈ ముంజెల కోసం తణుకు చుట్టుపక్కల గ్రామాలతో పాటు పెదతాడేపల్లి, లంక గ్రామాలకు చీకటితోనే వెళ్లి తాడిచెట్టుకు ఉన్న ముంజెలను కొనుగోలు చేసి ఆపై తాడి ఎక్కి ముంజెల గెలలు కిందికి దింపుతారు. ఆ పొలాల్లోంచి బయటకు తీసుకువచ్చి ద్విచక్ర వాహనాల ద్వారా తణుకు మార్కెట్‌కు తీసుకువచ్చి ముంజెకాయలను మూడువైపులా కత్తితో చెక్కి ముంజెకళ్లను బయటకు తీసి విక్రయాలు చేస్తున్నారు. అయితే తాడిచెట్టు ఎక్కి ముంజెలు తీసుకువచ్చి కాయల నుంచి కళ్లను తీసి విక్రయించడం పెద్ద పనే అయినప్పటికీ విక్రయాలు జోరుగా ఉండడంతో తప్పడంలేదని విక్రయదారులు చెబుతున్నారు. ఒక డజను ముంజెలు రూ. 50లు నుంచి రూ. 60లకు అమ్మకాలు చేస్తున్నారు.

ఆరోగ్యానికి మంచిచేసే గుణమున్న ముంజెలు

వేసవిలో మాత్రమే అందుబాటులోకి వచ్చే తాటి ముంజెలు ఐస్ ఆపిల్స్‌గా కూడా పిలుస్తుంటారు. నోట్లో వేసుకోగానే కరిగిపోయే స్వభావమున్న వీటిలో మానవాళి ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. పకృతి అందిస్తున్న తాటి ముంజెల్లో కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, జింక్, ఫాస్పరస్‌తో పాటు ఫైటోన్యూట్రియెంట్లు, విటమిన్స్, ఫైబర్ వంటి పోషకాలు అధిక శాతం ఉంటాయి. ముంజెల్లో నీటి శాతం అధికం కావడంతో వేసవిలో వీటిని తీసుకోవడం వలన డీహైడ్రేడ్ సమస్య రాదని తెలుస్తోంది. క్యాన్సర్ బారి నుంచి రక్షించే గుణం కూడా ఈ ముంజెల్లో ఉందని సైంటిఫిక్‌గా కూడా నిర్ధారణ జరిగినట్లు చరిత్ర చెబుతుంది. బరువు తగ్గేందుకు, జీర్ణ సమస్యలు తలెత్తకుండా కూడా మంచి ఫలితాలనిస్తాయని వైద్యులు చెబుతున్నారు.

ముంజెలు అమ్మకాలు బాగున్నాయి



వేసవిలో మాత్రమే అందుబాటులోకి వచ్చే ముంజెలు గత 45 రోజులుగా తణుకు మార్కెట్‌లో విక్రయిస్తున్నాం. తాటి ముంజెలు సేకరించడంలో శ్రమ ఎక్కువే అయినప్పటికీ ప్రజల ఆదరణ అధికంగా ఉండడంతో ముంజెల విక్రయాలకు చొరవ చూపిస్తున్నాం. వేసవిలో కొబ్బరితీత పనులకు వెళ్లకుండా ముంజె కళ్లు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాం. ముంజెల నుంచి కళ్లు బయటకు తీసే వరకు ప్రజలు ఎదురుచూసి మరీ తీసుకెళ్తారు.

– శంకర్, ముంజెల విక్రయదారుడు, తణుకు

చిన్ననాటి నుంచే యోగాపై ఆసక్తి చూపండి



గ్రంథాలయంలోని విద్యార్థులచే యోగా క్లాసులు నిర్వహిస్తున్న దృశ్యం



అత్తిలి శాఖా గ్రంథాలయంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న కె ధాత్విక

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణ శిబిరం ఉదయం జరిగింది. యోగా మాస్టార్ చంద్రశేఖర్‌చే విద్యార్థులకు యోగా ఆసనాలను ప్రాక్టీస్ చేయించారు. హాజరైన విద్యార్థులకు సైన్సు పాఠ్యాంశాలు, మూఢనమ్మకాలు నమ్మవద్దని, వినే నైపుణ్యాలు (కథలు), పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీషు, డాన్స్, పెయింటింగ్, ఆటలు, ఆధ్యాత్మిక విషయాలు, వివిధ సబ్జెక్ట్స్, నీతి కథలను చెప్పారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి ప్రత్తి వీరాస్వామి, ఉపాధ్యాయులు ఎస్.సత్యంలు చెప్పారు. గ్రంథాలయాధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మరింత మంది విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లైబ్రరీలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు

అత్తిలి: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు పేదరాశి పెద్దమ్మ కథలు, నీతి కథలు చెప్పడంతో పాటు వారితో చదివించారు. అనంతరం యోగా, డ్యాన్స్ క్లాసులు నిర్వహించారు. చిన్నారి కె ధాత్విక ప్రదర్శించిన కూచిపూడి నృత్యం సభికులను అలంకరించింది. శిక్షణా తరగతులు జూన్ 7వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి డి కృష్ణారావు తెలిపారు.ఈ కార్యక్రమంలో శిక్షణ తరగతుల ఉపాధ్యాయుడు ఎ రామకృష్ణ, వలంటీర్ ఎస్ శ్రీకాంత్, రిసోర్సుపర్సన్ కె కోమలి తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ పర్సా సత్యనారాయణ జీవితం ఆదర్శనీయం



పర్సా సత్యనారాయణ వర్ధంతి సభ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక నేత, మార్క్సిస్టు యోధుడు పర్సా సత్యనారాయణ వర్ధంతిని బుధవారం తాడేపల్లిగూడెం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. పర్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, జవ్వాది శ్రీనులు మాట్లాడుతూ పర్సా జీవిత విశేషాలను, చేసిన పోరాటాలను, సాధించిన హక్కులపై చర్చించారు. యువత పర్సా సత్యనారాయణ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జవ్వాది శ్రీను, కె.రామకృష్ణ, రామిరెడ్డి, కరక వెంకట్రావు, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాల అందజేత

కాళ్ల: బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాళ్ళ మండలం జువ్వలపాలెం గ్రామంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. బుధవారం ఫౌండేషన్ కార్యాలయంలో శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ శిక్షణా తరగతుల్లో మూడో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు 270 మంది పాల్గొన్నారని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. వారికి కంప్యూటర్‌పై ప్రాథమిక అవగాహన, యోగా, గణితంలో మెలకువలపై శిక్షణ అందించామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ గ్రామ వికాస సమితి కన్వీనర్ గోకరాజు వినోద రంగరాజు, కోఆర్డినేటర్లు ఎం రామకృష్ణంరాజు, పెనుమాకు భానుమూర్తి, నంబూరి శివవర్మ తదితరులు పాల్గొన్నారు.



వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

ముగిసిన నమ్మాళ్వార్ ఉత్సవాలు

నరసాపురం రూరల్: శ్రీ ఆదికేశవ ఎంబేరుమనార్ స్వామివారి ఆలయంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న నమ్మాళ్వార్ ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయం సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని ఆళ్వార్లను ఆలయ మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో చాగంటి సురేష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా దానేశ్వరి అమ్మవారి జాతర



దువ్వలో దానేశ్వరి అమ్మవారి జాతరలో ఊరేగింపు దృశ్యం

తణుకు టౌన్: ఎన్నికల కోడ్ కారణంగా దువ్వ గ్రామంలో శ్రీ దానేశ్వరి అమ్మవారి జాతర మహోత్సవాలు వెలవెల బోయాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలో శ్రీ దానేశ్వరి అమ్మవారి జాతర మహోత్సవాలను ప్రతీ సంవత్సరం వైశాఖ పౌర్ణమి ముందు రోజున ఘనంగా నిర్వహిస్తారు. అయితే ఈసంవత్సరం సార్వత్రిక ఎన్నికల కోడ్ కారణంగా అమ్మవారి ఊరేగింపులో మందు కాల్పులు కానీ, వాయిద్యాలు కానీ ఏర్పాటు చేయవద్దంటూ పోలీసులు నిబంధనలు విధించడంతో అమ్మవారి జాతర పేలవంగా సాగింది. బుధవారం రాత్రి దువ్వ గ్రామంలో అమ్మవారి జాతరను శక్తివేషాలతోనే ముగించేశారని భక్తులు పేర్కొంటున్నారు. ఈకార్యక్రమాల్లో ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.